ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి: కలెక్టర్

విజయనగరం కలెక్టరేట్, జనవరి 29(ఆంధ్రజ్యోతి) జిల్లాలో వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ సూచించారు. వచ్చే రెండు నెలల్లో పూర్తిగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా రహదారి భద్రత సమా వేశం బుధవారం జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను ప్రమాదాల రహిత జిల్లాగా నిలిపేందుకు అందరూ కృషి చేయాలన్నారు. రవాణా, పోలీస్, జాతీయ రహదారులు, మున్సిపల్ శాఖల అధికారులు సంయుక్తంగా కార్యాచరణ తయారు చేయాలని చెప్పారు.

27న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక

- షెడ్యూల్ విడుదల ● వచ్చే నెల మూడో తేదీన నోటిఫికేషన్
- పదో తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ ● మార్చి 3న ఓట్ల లెక్కింపు
- విజయనగరం జిల్లాలో 4937 మంది ఓటర్లు ● అమలులోకి ఎన్నికల కోడ్
- శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు బ్రేక్



విశాఖపట్నం/ విజయనగరం కలెక్టరేట్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి)

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు ఎన్నికల సంఘం బుధవారం షెడ్యూల్ విడుదల చేసింది. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న పాకలపాటి రఘువర్మ పదవీకాలం మార్చి 29తో ముగియనున్నది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి మూడో తేదీన నోటిఫికేషన్ జారీ కానుంది. పదో తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఆ మరుసటి రోజున నామినేషన్లు పరిశీలిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు 13వ తేదీ తుది గడువు. వచ్చే నెల 27వ తేదీ ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. మార్చి మూడో తేదీన ఓట్ల లెక్కింపు జరగనున్నది. ఎమ్మెల్సీ ఎన్నికలకు ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల పరిధిలో స్కూలు అసిస్టెంట్లు, అంతకంటే పైకేడర్ అంటే హెచ్ఎంలు, జూనియర్, సీనియర్ లెక్చరర్లు, వర్సిటీ అధ్యాపకులు, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో సెకండరీ విద్య బోధన చేసే టీచర్లు ఓటర్లుగా ఉంటారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదుకు గత ఏడాది సెప్టెంబరు 30 నుంచి అవకాశం ఇచ్చారు. నవంబరు 23న ముసాయిదా, డిసెంబరు 30న (మిగతా 8వ పేజీలో...)



పాఠ్యాంశంపై పట్టు.. విజయానికి మెట్టు

- మారిన టెన్త్ సిలబస్, పరీక్షా విధానం
- ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు

6 లో

బీసీ కార్పొరేషన్ రుణాలకు ఆహ్వానం

విజయనగరం కలెక్టరేట్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రాయితీ రుణాలు కావాలనుకునేవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ ఈడీ మురళి ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. అభ్యర్థులు ఈనెల 30 నుంచి వచ్చే నెల 7వతేదీ లోగా ఏపీ ఓబీఎంఎంఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వ్యవసాయ అనుబంధ, రవాణా, పరిశ్రమలు, సేవలు, వ్యాపార రంగాల్లో రాణించాలనుకునేవారికి ఇదో మంచి అవకాశమని తెలిపారు. బి.ఫార్మసీ, డిఫార్మసీ అభ్యర్థులు జనరిక్ షాపులు పెట్టుకోవచ్చని పేర్కొన్నారు. కుల ధ్రువపత్రాలను దరఖాస్తుతో పాటు అప్‌లోడ్ చేయాలన్నారు. పట్టణ ప్రాంతానికి చెందిన వారు రూ1,03,00లు గ్రామీణ ప్రాంతానికి చెందిన వారు రూ.81,000 లోపు ఆదాయం ఉండాలని పేర్కొన్నారు. వయసు 21 నుంచి 60 సంవత్సరాలు ఉండొచ్చునని, తెల్లరేషన్ కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఒక తెల్ల రేషన్‌కార్డుపై ఒక్కరు మాత్రమే లబ్ధిపొందేందుకు అర్హులని స్పష్టంచేశారు.

నగరంలో కొత్తగా 250 ఎల్ఈడీలు

- ఒక్కో డివిజన్‌కు ఐదు కేటాయింపు

7 లో

కూల్‌డ్రింక్‌లో పురుగు అవశేషం

- ఎస్.కోట సినిమా థియేటర్ క్యాంటీన్‌లో విక్రయం
- యాజమాన్యం వైఖరితో ఆహార తనిఖీ అధికారికి ఫిర్యాదు
- లైసెన్స్ లేకుండా అమ్ముతున్నట్లు బట్టబయలు

శృంగవరపుకోట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి):

స్థానికుడు గంధవరపు సతీష్ భార్యా పిల్లలతో మంగళవారం రాత్రి శృంగవరపుకోట థియేటర్‌లో సినిమా చూసేందుకు మొదటి ఆటకు వెళ్లాడు. విరామ సమయంలో థియేటర్ క్యాంటీన్‌లో కూల్‌డ్రింక్ తీసుకున్నాడు. తాగేందుకు సిద్ధపడగా సీసాల్లో చనిపోయిన పురుగు కనిపించింది. విషయాన్ని థియేటర్ యాజమాన్యం దృష్టిలో పెట్టాడు. వారు తమకేంటి సంబంధమంటూ బుకాయించారు. కూల్‌డ్రింక్‌లను సరఫరా చేసిన డీలర్‌ను అడగాలంటూ దురుసుగా సమాధానమిచ్చారు. దీంతో సతీష్ పోలీసులకు, ఆహార తనిఖీ అధికారికి ఫిర్యాదు చేశారు. కాగా జిల్లా ఆహార తనిఖీ అధికారి షేక్ నాగూల్ మీరా బుధవారం ఆ సినిమా థియేటర్ క్యాంటీన్‌తో పాటు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఉన్న అన్ని రకాల ఆహార దుకాణాలను పరిశీలించారు. లైసెన్స్‌లు లేకుండా విక్రయాలు జరుపుతున్నట్లు గుర్తించారు. మరోసారి తనిఖీలకు వచ్చినప్పుడు లైసెన్స్‌లను చూపించకపోతే రూ.2లక్షల వరకు జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. థియేటర్ క్యాంటీన్‌లో చనిపోయిన పురుగు వున్న కూల్‌డ్రింక్ సీసాతో పాటు మరో మూడు కూల్‌డ్రింక్‌లను సీజ్ చేశారు.



చనిపోయిన పురుగున్న డ్రింక్

- వాస్తవానికి పాడైన ఆహార పదార్థాలను ఎప్పటికప్పుడు గుర్తించి ధ్వంసం చేయాలి. దుకాణ సమీపంలో ఉంచకూడదు. ఉంచితే దుకాణాల్లో పనిచేసేవారు విక్రయించేందుకు అవకాశం వుంది. రంగులతో వున్న రొట్టెలను అమ్ముతున్నారు. వండిన చికెన్, మటన్‌లకు రంగులు పూస్తున్నారు. ఇలా తయారు చేయడం నిబంధనలకు విరుద్ధమైనప్పటికీ హోటల్, దుకాణ యజమానులు పట్టించుకోవడం లేదు. నిల్వ మాంసం తినడంతో ఇటీవల స్థానికంగా వున్న ఓ వసతి గృహంలోని బాలికలు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే.

56 కేసులు నమోదు చేశాం

జిల్లా ఆహార తనిఖీ అధికారి తయారు చేసిన స్టేట్ మెంట్‌పై సంతకం పెట్టేందుకు థియేటర్ యాజమాన్యం నిరాకరించారు. ఇదే విషయాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్‌కు నివేదిస్తానని యాజమాన్యానికి ఆహార తనిఖీ అధికారి షేక్ నాగూల్ మీరా తెలిపారు. అయినప్పటికీ యాజమాన్యం పట్టించుకోలేదు. జిల్లాలో ఆహార తనిఖీల్లో భాగంగా 56 కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎక్కువ కేసులు జిల్లా నుంచే నమోదయ్యాయన్నారు.



ఎస్.కోట: హోటల్ వంట గదిని తనిఖీ చేస్తున్న షేక్ నాగూల్‌మీరా

మరో 2 నెలలు



ఫ్రీహోల్డ్ భూముల్లో రిజిస్ట్రేషన్లను నిలిపేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మరో రెండు నెలల పాటు అమలు కానుంది. లోతుగా విచారించేందుకు గడువు పొడిగిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అసైన్డ్ భూములపై శాశ్వత హక్కులు (ఫ్రీహోల్డ్) కల్పిస్తూ తీసుకున్న నిర్ణయం తీవ్ర వివాదాస్పదం అయిన సంగతి తెలిసిందే. ఈ ప్రక్రియలో భారీగా అవినీతి జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. పేదల భూములను బడాబాబులు స్వాధీనం చేసుకునే ఎత్తుగడ అమలు చేసినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయింది. విజయనగరం జిల్లాలోనూ ఫ్రీహోల్డ్ భూములపై అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయి. కాగా ఆ భూముల రిజిస్ట్రేషన్లపై విధించిన నిషేధాన్ని నెలాఖరులోగా సడలిస్తారని ప్రచారం నడిచింది. కానీ మరో రెండు నెలల పాటు రిజిస్ట్రేషన్ల నిలిపివేతను పొడిగించారు. ఈ మేరకు ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీచేసింది.

- ఫ్రీహోల్డ్ భూముల్లో రిజిస్ట్రేషన్లపై కొనసాగనున్న విరామం
- లోతుగా అధికారుల విచారణ ● అన్ని కోణాల్లో ఆరా
- అక్రమార్కుల గుండెల్లో రైళ్లు

విజయనగరం, జనవరి 29(ఆంధ్రజ్యోతి):

రాష్ట్ర వ్యాప్తంగా అసైన్డ్ (డీపట్టా) భూములు ఎన్ని ఉన్నాయి? అందులో ఫ్రీహోల్డ్‌లో చేరినవి ఎన్ని? నిబంధనలు ప్రకారం ఎన్ని ఎకరాల్లో రిజిస్ట్రేషన్లు జరిగాయి? నోటీపై చేసినవి ఎన్ని, నోటీపై కాకుండా ఎన్ని చేశారు? అనేదానిపై పూర్తి స్థాయిలో పరిశీలించి నివేదిక సమర్పించాలని అన్ని జిల్లాల కలెక్టర్లను సీసీఎల్ఏ ఆదేశించింది. ఈ నేపథ్యంలో వాటిపై లోతుగా ఆరా తీస్తున్నారు. ఈ ప్రక్రియ కోసం ముందుగా విజయనగరం జిల్లాను ఎంచుకోవడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా 45 వేల ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. వీటిలో ఫ్రీహోల్డ్‌లోకి వచ్చినవి 5,662.33 ఎకరాలుగా గుర్తించారు. ఇందులో 205 ఎకరాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లు అయ్యాయి. వందలాది ఎకరాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లు చేయించేందుకు సిద్ధపడుతుండగా కూటమి ప్రభుత్వం గుర్తించి నిలిపివేసింది. అప్పట్లో కొందరు వైసీపీ నేతలు తమ పరపతిని ఉపయోగించి ముందస్తు ఒప్పందాలతో కొన్ని భూములను ఫ్రీహోల్డ్‌లోకి మార్చినట్టు ఆరోపణలున్నాయి.

జిల్లాలో అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు నిర్మాణం జరుగుతున్న సంగతి తెలిసిందే. దీనికితోడు రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో పెద్ద ఎత్తున అసైన్డ్ భూములు ఉన్నట్టు నాటి వైసీపీ పెద్దలు గుర్తించారు. వాటిని చేజిక్కించుకునేందుకు 2023 డిసెంబరు 19న ఆ ప్రభుత్వం ప్రత్యేక జీవో విడుదల చేసింది. అసైన్డ్ భూముల చట్టం 1977 ప్రకారం.. 20 ఏళ్ల గడువు దాటిన భూములపై రైతులకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని ఉత్తర్వులు జారీచేసింది. ఈ లెక్కన జిల్లాలో 5,700 ఎకరాలను ఫ్రీహోల్డ్‌లో పెట్టారు. అంటే ఈ భూములకు సంబంధించి రైతులకు పూర్తి యాజమాన్య హక్కులు ఇచ్చినట్టేనన్న మాట. కాగా ఆ భూముల్లో చాలా వరకూ అప్పటి వైసీపీ ప్రభుత్వ పెద్దలు లాగేసుకున్నారన్న అనుమానాలు ఉన్నాయి. వీటిపై కూటమి ప్రభుత్వానికి పెద్దఎత్తున ఫిర్యాదులు రావడంతో రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి ఆర్పీ సిసోడియాకు విచారణ బాధ్యతలు అప్పగించింది. ఆగస్టులో ఆయన జిల్లాలో పర్యటించారు. పెద్ద ఎత్తున ఆయనకు జిల్లా ప్రజలు అర్జీలు ఇచ్చారు.

కొనుగోలు చేసిన ఉన్నతాధికారి

వైసీపీ హయాంలో రాష్ట్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న కీలక అధికారి పెద్ద ఎత్తున తన కుటుంబసభ్యుల పేరుతో భూములు కొనుగోలు చేశారని సమాచారం. ఎన్నికల పోలింగ్ అనంతరం ఆయన ఉత్తరాంధ్ర పర్యటన వివాదాస్పదంగా మారింది. అప్పట్లో భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణ పనుల పరిశీలన పేరిట వచ్చిన ఆయన.. భూముల కొనుగోలుకే వచ్చారంటూ విశాఖకు చెందిన జనసేన నేత ఒకరు సంచలన ఆరోపణలు చేశారు. అయితే కూటమికి విజయం దక్కడంతో ఆ అధికారి సెలవుపై వెళ్లిపోయారు.

ఆ రెండు నియోజకవర్గాల్లో..

ప్రధానంగా నెల్లిమర్ల, శృంగవరపుకోట నియోజకవర్గాల్లోనే అధికంగా భూ అక్రమాలు చోటుచేసుకుంటున్నట్టు తెలుస్తోంది. భోగాపురంలో అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపటుతుండడంతో అక్కడ భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. అందుకే డీపట్టా లబ్ధిదారులతో ముందుగానే బేరం మాట్లాడినట్లు సమాచారం. పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం మండలాల్లో 41.6 ఎకరాల ఫ్రీహోల్డ్ ల్యాండ్ రిజిస్ట్రేషన్ జరిగినట్లు సమాచారం. పోలిపల్లిలో 16.04 ఎకరాలు, రావాడలో 3.56 ఎకరాలు, ఎల్.జగన్నాథపురంలో 15.44 ఎకరాలు, పెద్దతాడివాడలో 5.09 ఎకరాలు, కంచేరులో 1.33 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ జరిగింది.

విచారణలో ఆసక్తికర అంశాలు

అధికారుల విచారణల్లో ఆసక్తికర పరిణామాలు వెలుగులోకి వచ్చాయి. ప్రస్తుతం ఎకరా భూమి బహిరంగ మార్కెట్‌లో రూ.50 లక్షలకుగాపైగా ఉంటే ముందస్తు ఒప్పందం మేరకు అసైన్డ్ భూముల లబ్ధిదారుల చేతుల్లో రూ.3 నుంచి రూ.5 లక్షల వరకూ పెట్టి చేతులు దులుపుకున్నట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో వైసీపీ చోటా నేతలే సూత్రధారులు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు సైతం ఈ దందాలో ఉన్నారు.



మామిడి చెట్లపై కురుస్తున్న మంచు

మంచు గుబులు

- మామిడి పిందె రాలడం, కాయ సైజు తగ్గడంపై రైతుల్లో టెన్షన్
- ముందస్తు చర్యల్ని సూచిస్తున్న ఉద్యాన శాఖ
- తొడుగులు వాడాలంటున్న అధికారులు

చీపురుపల్లి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పూత దశలో ఉన్న మామిడి పంటకు పుట్టెడు కష్టాలు పొంచి ఉన్నాయి. దట్టంగా మంచు కురుస్తుండడం రైతులకు ఆందోళన కలిగిస్తోంది. బాగా పూత పూసిందన్న ఆనందంలో రైతులు తెగుళ్లను ఏమరిస్తే పంటను నష్టపోవడం తప్పదని ఉద్యానశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. తెగుళ్లను సకాలంలో నివారించకపోతే పంట దిగుబడిపై ప్రభావం చూపే ప్రమాదం ఉంది. పిందె రాలిపోవడం, కాయ సైజు తగ్గడం, పక్వ దశలో కాయలపై మచ్చలు ఏర్పడడం వంటి సమస్యలు ఎదురుకావొచ్చునంటున్నారు. జిల్లాలో 30,834 హెక్టార్లలో మామిడి తోటలు సాగులో ఉండగా కాపులో 28,500 హెక్టార్లు ఉన్నట్టు గణాంకాలు తెలియజేస్తున్నాయి. పూత దశ నుంచి పిందె (మిగతా 8వ పేజీలో..)

పనితీరు మెరుగుపడకపోతే సస్పెన్షన్

- పీఆర్ ఇంజినీర్లపై ఆగ్రహించిన కలెక్టర్ అంబేడ్కర్




విజయనగరం కలెక్టరేట్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పనితీరు మెరుగుపర్చుకోకపోతే సస్పెండ్ చేస్తామని కలెక్టర్ అంబేడ్కర్ హెచ్చరించారు. ఇన్నాళ్లూ హెచ్చరికలకే పరిమితం అయ్యాయని, ఇక నుంచి చర్యలు మొదలు పెడుతున్నామన్నారు. ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ పనులు, గోకులాలు తదితర అంశాలపై బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. కొందరు అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బొబ్బిలి పీఆర్ ఏఈ, డీఈ, ఇద్దరు ఏపీవోలకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ కింద సుమారు రూ.280 కోట్ల విలువైన సీసీ, బీటీ రోడ్లు, డ్రైన్లు తదితర 2,851 పనులను మూడు దశల్లో మంజూరు చేశామన్నారు. వీటిల్లో 1171 పనులను మాత్రమే పూర్తి చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మూడు నెలల్లో కేవలం 40 శాతం పనులే చేశారని, నిధుల వినియోగం మరింత అధ్వానంగా ఉందన్నారు. నిధులు వినియోగించకపోతే జిల్లా ప్రజలు నష్టపోతారని చెప్పారు. ఇన్‌చార్జి ఏఈలు ఉన్న చోట ఇంజినీరింగ్ అసిస్టెంట్లను నియమించుకోవాలని సూచించారు.

కలెక్టరేట్‌లో ప్రతిరోజూ వినతుల స్వీకరణ

ప్రతిరోజూ ప్రజల నుంచి వినతులు స్వీకరించే కౌంటర్‌ను బుధవారం రాత్రి జేసీ సేతుమాధవన్ ప్రారంభించారు. ప్రజలు తమ సమస్యలను ప్రతిరోజు ఉదయం 10.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ అందజేయవచ్చు. రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా ఈ తరహా కౌంటర్‌ను ప్రారంభించారు.

పాఠ్యాంశంపై పట్టు.. విజయానికి మెట్టు



● మారిన టెన్త్ సిలబస్, పరీక్ష విధానం ● ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు
● హాజరుకానున్న 23,722 మంది విద్యార్థులు

రాజాం రూరల్, బొబ్బిలి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి జీవితంలో అత్యంత ముఖ్యమైనది పదో తరగతి. ఉన్నత విద్యకు బాటలు వేసేది... భవిష్యత్తును నిర్ణయించేది పదో తరగతి పబ్లిక్ పరీక్షలు. ఈ సంవత్సరం జిల్లాలో 23,722 మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్నారు. మార్చి 17 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇందులో విజేతగా నిలిచి... మంచి భవితకు పునాది వేసుకునేందుకు ఇంకా మిగిలింది దాదాపు 45 రోజులు. ఈ కొద్ది రోజులు ఎంతో కీలకం. సిలబస్ మారినందున విదార్థులు అవగాహనతో.. ప్రణాళికాయుతంగా చదవాల్సిన అవసరం ఉందని సబ్జెక్ట్ నిపుణులు చెబుతున్నారు. ఒత్తిడి లేకుండా చదవాలని మరోవైపు వైపు వైద్యులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో పరీక్షల్లో మంచి మార్కుల సాధనకు విద్యార్థులు ఏం చేయాలో.. ఎలా చదవాలో జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న సీనియర్ ఉపాధ్యాయులు సూచనలు.. సలహాలు ఇస్తున్నారు.

మారిన సిలబస్...

పదో తరగతి సిలబస్ పూర్తిగా మారిపోయింది. ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌ను ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం పరీక్ష విధానంలో కూడా మార్పులు తీసుకు వచ్చింది. గతంలో 11 పేపర్లు ఉండగా... ఈ విద్యా సంవత్సరం నుంచి 7 పరీక్షలకే కుదించారు. తెలుగు, ఇంగ్లీషు, హిందీ, సోషల్, మేథ్స్‌తో పాటు భౌతిక, రసాయన శాస్త్రాలు, జీవశాస్త్రానికి వేర్వేరుగా పరీక్షలు నిర్వహించనున్నారు. గతంలో ఆదివారం లేదా ఇతరత్రా సెలవులు వస్తే తప్ప వరుసగా పరీక్షలు నిర్వహించేవారు. విద్యాశాఖ తాజా నిర్ణయం ప్రకారం రోజు తప్పించి రోజు పరీక్షలు నిర్వహిస్తారు. ఇక సమయం విషయానికి వస్తే... భౌతిక, రసాయన శాస్త్రాలు, జీవశాస్త్రం పరీక్షలకు రెండేసి గంటలు సమయం కాగా, ఒక్కో పరీక్షకు 50 మార్కుల వంతున కేటాయించారు. మిగిలిన అయిదు పరీక్షలకు మూడున్నర గంటల సమయం. వందేసి మార్కులకు పరీక్షలు నిర్వహిస్తారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి



ఈ ఏడాది మార్చి 17 నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు జిల్లాలోని 435 పాఠశాలల నుంచి 23,722 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి సిలబస్‌తో పాటు పరీక్ష విధానం పూర్తిగా మారింది. అయినా విద్యార్థులు ఆందోళన చెందాల్సిన పనిలేదు. ఇప్పటికే ఎస్‌సీఈఆర్‌టీ అందజేసిన స్టడీ మెటీరియల్ పంపిణీ చేశాం. వాటిని క్షుణ్ణంగా చదివితే మేలు.

-మాణిక్యం నాయుడు, జిల్లా విద్యాశాఖాధికారి, విజయనగరం

భౌతిక శాస్త్రం
● మంచి మార్కులకు అవకాశం..



దీనిలో 17 ప్రశ్నలు. 50 మార్కులు. 2 గంటల సమయం. ఒక మార్కు ప్రశ్నలు 8. రెండు మార్కుల ప్రశ్నలు 3. నాలుగు మార్కుల ప్రశ్నలు 3, 8 మార్కుల ప్రశ్నలు 3 ఉంటాయి. ప్రధానంగా రసాయన సమీకరణాలు తుల్యం చేయడం, నీటిలో ద్రావణం విద్యుత్ వాహకతను పరిశీలించే ప్రయోగం, కాంతి పాఠంలో పుటాకార దర్పణం, కుంభాకార కటకానికి సంబంధించిన కిరణ చిత్రాలు. సోడియం క్లోరైడ్, సోడియం హైడ్రాక్సైడ్, బ్లీచింగ్ పౌడర్, బేకింగ్ సోడా, వాషింగ్ సోడా, అనువర్తనాలు, హ్రస్వ దృష్టి దోషం-నివారణ, దీర్ఘదృష్టి దోషం-నివారణ, అయిర్వెడ్ ప్రయోగశాల కృత్యం వంటి అంశాలతో పాటు లోహాలు, అలోహాలు, కార్బన్, దాని సమ్మేళనాలు, విద్యుత్, విద్యుత్ ప్రవాహం యొక్క అయస్కాంత ప్రభావం పాఠాలను చదివితే మంచి మార్కులు సాధించవచ్చును.

-పండూరు వేణుగోపాల్, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు, జడ్పీ స్కూల్, కంచరాం, రాజాం మండలం

జీవ శాస్త్రం
● బొమ్మలపై దృష్టి పెట్టాలి...



జీవశాస్త్రం ప్రశ్నపత్రంలో 17 ప్రశ్నలు (50 మార్కులకు) ఉంటాయి. ఇందులో ఒక మార్కు ప్రశ్నలు 6, రెండు మార్కులవి 4, నాలుగు మార్కులకు 5, ఎనిమిది మార్కుల ప్రశ్నలు 2 ఉంటాయి. ప్రయోగాలు, బొమ్మలపై 12 మార్కులు ఉంటాయి. మిగిలిన పరీక్షలకు భిన్నంగా సైన్స్ పరీక్షలు ఉంటాయి. జీవక్రియలు, ప్రత్యుత్పత్తి, అనువంశికత, నియంత్రణ, సమన్వయం అధ్యాయాలు ఉంటాయి. ఇందులో జీవక్రియలు, ప్రత్యుత్పత్తి నుంచే 24 ప్రశ్నలు వస్తాయి. వీటిపై దృష్టి పెట్టాలి. బొమ్మలు, బొమ్మ ఆధారిత ప్రశ్నలు, ఫ్లో చార్టులు, ప్రయోగాలు, ప్రయోగ ఆధారిత ప్రశ్నలు, పట్టికలు, పట్టిక ఆధారిత ప్రశ్నలు చాలా కీలకం.

-గుడ్ల భరత్‌కుమార్, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు, జడ్పీ స్కూల్, డోలపేట. రాజాం

సాంఘిక శాస్త్రం
● ఇష్టపడి చదివితే సులువే..



ఇష్టపడి చదివితే సాంఘిక శాస్త్రంలో ఎక్కువ మార్కులు సాధించవచ్చును. 100 మార్కుల ప్రశ్నపత్రంలో నాలుగు విభాగాలు ఉంటాయి. జాగ్రఫీ 23, చరిత్ర 23, పాలిటిక్స్ 23, ఆర్థికశాస్త్రం 23, మ్యాప్ పాయింటింగ్‌కు 8 మార్కులు ఉంటాయి. విద్యార్థులు 4, 8 మార్కుల ప్రశ్నలకు జవాబులు రాసేటపుడు ఉపశీర్షికలు (సబ్ హెడ్డింగులు) పెట్టి, పాయింట్ల రూపంలో సమాధానాలు రాస్తూ మధ్యలో ప్రధాన అంశాలకు అండర్‌లైన్ చేస్తే మేలు. 8 మార్కుల ప్రశ్నలకు జవాబులు పెద్దగా ఉన్నాయని భయపడాల్సిన అవసరం లేదు. సమయాన్ని చూసుకుంటూ వీలైనంత ఎక్కువ సమచారం సమాధానంలో పొందుపరచాలి. మ్యాప్ గుర్తించడంపై అవగాహన పెంచుకోవాలి.

-మర్రాపు రామకృష్ణ, సోషల్ అసిస్టెంట్, జడ్పీ స్కూల్, వెంకట భైరిపురం, మక్కువ మండలం

తెలుగు
మూడు విభాగాలపై దృష్టి పెట్టాలి



తెలుగు ప్రశ్నపత్రం మూడు విభాగాలుగా ఉంటుంది. మొదటి భాగం 32 మార్కులకు ఉంటుంది. పద్య, గద్యభాగాల నుంచి చెరొక ప్రశ్న చొప్పున రెండు వస్తాయి. మూడో ప్రశ్న ఉపవాచకం నుంచి, నాలుగో ప్రశ్న లేఖ రాయాల్సి ఉంటుంది. నాలుగు ప్రశ్నలకూ జవాబులు రాయాలి. రెండోభాగం 36 మార్కులకు ఉంటుంది. 5వ ప్రశ్నగా కవి పరిచయం, 6వ ప్రశ్నగా గద్య భాగం నుంచి వ్యాసం, నేపథ్యం, కథ, కథానిక, చేజారిన బాల్యం ఇస్తారు. 7వ ప్రశ్నగా ఉప వాచకం నుంచి విశ్వామిత్రుడు, మారీచుడు, మందర, కైకేయి, హనుమంతుడు, సుగ్రీవుడు గురించి రాయాల్సి ఉంటుంది. మూడోభాగం 32 మార్కులకు ఉంటుంది. ఇందులో అన్నీ రెండు మార్కుల ప్రశ్నలు ఉంటాయి. అలంకారాలు, గణ విభజన, అర్థాలు, పర్యాయ పదాలు, నానార్థాలు, ప్రకృతి, వికృతి, జాతీయాలపై ప్రశ్నలు ఉంటాయి.

-సంకిలి ప్రసాదరావు, తెలుగు ఉపాధ్యాయుడు, జడ్పీ హైస్కూల్, చింతాడ, బొబ్బిలి మండలం

హిందీ
● వ్యాకరణానికి ప్రాధాన్యం



పది పరీక్షల్లో విద్యార్థులు హిందీ పరీక్షను సునాయాసంగా గట్టెక్కవచ్చు. ఆరు భాగాలుగా పరీక్ష పత్రం ఉంటుంది. మొదటి భాగంలో వ్యాకరణాంశాలు ఉంటాయి. అందులోని జవాబులను గుర్తించాల్సి ఉంటుంది. రెండో భాగంలో రెండు పేరాగ్రాఫ్‌లు ఇచ్చి కిందనిచ్చిన ప్రశ్నలకు సమాధానాలు అడుగుతారు. మూడో భాగంలో కబీర్, మైథిలీశరణ్ వంటి కవులకు సంబంధించిన ప్రశ్నలు వస్తాయి. నాలుగో భాగంలో కబీర్‌కు సంబంధించిన మూడు ప్రశ్నలు ఉంటాయి. అయిదో భాగంలో వ్యాసం, ఆరో భాగంలో లేఖ రాయాల్సి ఉంటుంది.

- యామలాపల్లి శంకరరావు, హిందీ ఉపాధ్యాయుడు, జడ్పీ హైస్కూల్, గొల్లాది, బాడంగి మండలం

ఇంగ్లీషు
● స్టడీ మెటీరియల్ చదివితే మేలు



ఎన్‌సీఈఆర్‌టీ సరఫరా చేసిన స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది. ఆంగ్ల ప్రశ్నపత్రం మూడు సెక్షన్లుగా విభజించారు. సెక్షన్-ఎలో రీడింగ్ కాంప్రహెన్షన్‌లో 30 మార్కుల్లో 17 మార్కులు బహుళైచ్ఛిక ప్రశ్నలు, 8 మార్కులకు సాధారణ ప్రశ్నలు, 5 మార్కులకు జంబుల్డ్ సెంటెన్సెస్ ఉంటాయి. సెక్షన్-బిలో 40 మార్కులకు వకాబ్‌లరీ ఉంటుంది. ఇంగ్లీష్ వర్క్‌బుక్ వర్డ్స్ అండ్ ఎక్స్‌ప్రెషన్స్ నుంచి ప్రశ్నలు వస్తాయి. ప్రధానంగా 23 నుంచి 28 వరకు ప్రశ్నలపై అవగాహన పెంచుకుంటే మార్కులు సాధించవచ్చును. సెక్షన్-సి క్రియేటివ్ రైటింగ్‌లో 35వ ప్రశ్నగా కాన్వర్జేషన్ లేదా డైరీ ఎంట్రీ, 36వ ప్రశ్నగా లెటర్ రైటింగ్, స్క్రిప్ట్ ఫర్ స్పీచ్, 37వ ప్రశ్న ఫ్రేమింగ్ క్వశ్చన్స్ లేదా ఇన్ఫర్మేషన్ ట్రాన్స్‌ఫర్‌పై 30 మార్కులకు ఉంటుంది.

-బి.వి.అచ్యుత కుమార్, ఇంగ్లీషు ఉపాధ్యాయుడు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రాజాం

గణితం
● సాధనతో మంచి మార్కులు



గణితంలో సులువుగా మార్కులు సాధించవచ్చును. ప్రధానంగా వాస్తవ సంఖ్యలు (9 మార్కులు), రెండు చల రాశులలో రేఖీయ సమీకరణల గ్రాఫ్ (9 మార్కులు), నిరూపక రేఖా గణితం (10 మార్కులు), సాంఖ్యక శాస్త్రం (12 మార్కులు), సంభావ్యత (13 మార్కులు).. ఈ అయిదు అధ్యాయాల నుంచి 53 మార్కులు సాధించవచ్చు. బహుపదుల గ్రాఫ్ (4 మార్కులు), త్రికోణమితి చివరి అధ్యాయం (4 మార్కులు), సాంఖ్యక శాస్త్ర సూత్రం, పదాల వివరణ (4 మార్కులు) నుంచి తప్పనిసరిగా ప్రశ్నలు వస్తాయి. క్షేత్రమితి సూత్రాలు, వివరణ, బొమ్మలు, త్రికోణమితి, అనువర్తనాలు, బొమ్మలు సాధన చేయాలి. ఆంధ్రప్రదేశ్ గణిత ఉపాధ్యాయ సంఘం ప్రచురించిన 'గణితదీప్తి' విద్యార్థులకు చాలా ఉపయోగం. ఎక్కువ మార్కులు సాధించాలంటే 1 మార్కు, రెండు మార్కుల ప్రశ్నలు చాలా కీలకం. మాదిరి ప్రశ్నపత్రాలు సాధన చేస్తే మంచిది.

-కొత్తకోట కృష్ణంరాజు, గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు, జడ్పీ స్కూల్, లక్ష్మీపురం, రేగిడి మండలం

మళ్లీ వస్తాం తల్లీ

● ముగిసిన శంబర జాతర



వనంగుడిలో పోలమాంబ



అమ్మవారి అంపకోత్సవ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్,ఈవో తదితరులు

సాలూరు రూరల్/మక్కువ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): శంబర పోలమాంబ అమ్మవారి జాతర బుధవారం అంపకోత్సవంతో ముగిసింది. గ్రామంలో తిరువీధులు నిర్వహించి... అమ్మవారి ఘటాలను చదురు గుడి నుంచి వనం గుడికి సంప్రదాయం ప్రకారం తీసుకెళ్లారు. అంపకోత్సవంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఘటాలు చదురుగుడి నుంచి వనం గుడి వెళ్లే క్రమంలో దారి పొడవున చీరలను పరిచారు. ఘటాలను మోసే వారు నేలపై నడవకుండా వనం గుడి వరకు తీసుకెళ్లారు. ఘటాలకు పూజలు చేశారు. పాల జంగిడిని మోయడానికి మహిళలు పోటీ పడ్డారు. అంపకోత్సవం సందర్భంగా ఆచారం ప్రకారం పొట్టేళ్లను మొక్కుబడిగా చెల్లించారు. ఎటువంటి అపశ్రుతులు లేకుండా జాతర విజయవంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. సిరిమానోత్సవం రోజున దర్శనా నికి రాలేని భక్తులు బుధవారం అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి అంపకోత్సవంలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ నైదాన తిరుపతి, ఈవో వీవీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అమ్మవారి మారు జాతర వచ్చే నెల 4న జరగనుంది. ఆ రోజున రథసప్తమి కావడంతో భక్తుల సంఖ్యపై దేవాదాయ వర్గాలు అంచనాకు రాలేకపోతున్నారు.



ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆలయ ఆదాయం రూ.25 లక్షలు..

మక్కువ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పోలమాంబ అమ్మవారి మొదటి వారం జాతర ఆదాయం రూ.25 లక్షల 2 వేల 816 వచ్చినట్టు ఈవో వి.వి.సూర్యనారాయణ బుధవారం తెలిపారు. శీఘ్ర దర్శనం రూ.వంద టిక్కెట్ ద్వారా రూ.4 లక్షల 41 వేల 700, ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.లక్షా 21 వేల 380, కేశఖండన ద్వారా రూ.20 వేల 200 వచ్చిందన్నారు. మహన్నదానం విరాళాలు రూ.78 వేల 911, లడ్డూ ప్రసాదం విక్రయంతో రూ.97 వేల 995, పులిహోరా ప్రసాదంతో రూ.76 వేల 30, వచ్చినట్టు తెలిపారు. టెండర్ కం బహిరంగ వేలం ద్వారా రూ.5 లక్షల 51 వేలు, చీరలు, రవికలు, ఇత్తడి సామగ్రి ద్వారా రూ.4 లక్షల 5 వేలు సమకూరాయన్నారు. తలనీలాల ద్వారా రూ.3 లక్షల 37 వేల 600, వనం గుడి దీపాల ద్వారా రూ.రెండు లక్షల 21 వేలు, లామినేషన్ ఫొటోల విక్రయంతో రూ.లక్షా 52 వేల ఆదాయం వచ్చినట్టు ఈవో తెలిపారు.

నేడు మరియగిరి యాత్ర

● ఏర్పాట్లు పూర్తి



మరియమాత విగ్రహం

వీరఘట్టం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం సమీపంలోని యు.వెంకంపేట వద్ద మరియగిరి కొండపై వెలసిన శ్రీకాకుళం మేత్రాసనం పాలపునీతురాలు మేరీమాత యాత్రా మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ప్రతి సంవత్సరం జనవరి 30న మరియగిరి యాత్ర జరుగుతుంది. కులమతాలకు అతీతంగా భక్తులు వచ్చి కొబ్బరికాయలు కొట్టి... తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. భక్తులు మేరీమాతను దర్శించుకొనేందుకు కొండపై క్యూలైన్లు ఏర్పాటు చేశారు. యాత్రా ప్రాంగణంలో ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం మేత్రాసనం పీఠాధిపతి రాయరాల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు.

పోలీసు బందోబస్తు...

మరియగిరి యాత్రకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్‌ఐ జి.కళానిధి తెలిపారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు బృందాలను నియమించామన్నారు. పార్కింగ్ స్థలాల్లో వాహనాలు నిలపాలని భక్తులను కోరారు.

ప్రత్యేక బస్సులు..

ఈ యాత్రకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరవుతారు. దీని కోసం పార్వతీపురం, పాలకొండ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. పాలకొండ ఆర్టీసీ డిపో నుంచి రెగ్యులర్ బస్సులతో పాటు అదనంగా మూడు సర్వీసులను నడపనున్నారు. ఉదయం ఏడు గంటల నుంచి రాత్రి 7 వరకు బస్సులు నడుపుతున్నామని, అవసరమైతే మరిన్ని బస్సు సర్వీసులు అందుబాటులోకి తెస్తామని పాలకొండ డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు తెలిపారు. వలంటీర్లను కూడా నియమించామని ఆయన చెప్పారు.



మాఘ మాసం.. మంచి ముహూర్తం!

● జిల్లాలో జోరుగా పెళ్లిళ్లు.. గృహ ప్రవేశాలు ● కల్యాణ మండపాలకు డిమాండ్
● మూడేళ్ల తరువాత ఈ ఏడాదిలో అధికంగా శుభతిథులు



గజపతినగరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో పెళ్లి బాజాలు మోగనున్నాయి. శుభ మంత్రాలు వినిపించనున్నాయి. ఇళ్లు, వేదికలు మామిడి తోరణాలతో కళకళలాడనున్నాయి. వందలాది జంటలు ఒక్కటి కానున్నాయి. కొత్త ఇళ్లు బంధువులతో సందడిగా మారనున్నాయి. రానున్న ఫిబ్రవరి, మార్చి నెలల్లో శుభ తిథులు ఉండడంతో కల్యాణాలు, గృహ ప్రవేశాలు, ఉపనయనాలు, ఇతర శుభ కార్యక్రమాలకు ప్రజలు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా వివాహాలు అధిక సంఖ్యలో జరుగనున్నాయి. ప్రధాన లాడ్జీలు, కల్యాణ మండపాలు, ఈవెంట్స్ సెంటర్లు బిజీగా మారనున్నాయి. ఈ నెల 30వ తేదీ నుంచి మార్చి 16 వరకూ ముఖ్యమైన తిథులు ఉండడంతో పెళ్లిళ్లు, గృహప్రవేశాలు అధిక సంఖ్యలో జరుగనున్నాయి. ఆ తరువాత కూడా మంచి ముహూర్తాలు ఉన్నాయని పురోహితులు చెబుతున్నారు. ఈ ఏడాది 12 నెలల కాలంలో కేవలం మూడు నెలలు మినహా మిగిలిన 9 నెలల్లో 104 పెళ్లి ముహూర్తాలు ఉన్నాయని పురోహితులు చెబుతున్నారు. గడిచిన మూడేళ్లతో పోలిస్తే ఈ ఏడాది అధిక సంఖ్యలో ముహూర్తాలు ఉన్నాయి. వాస్తవానికి ఈ నెల 22 నుంచే పెళ్లి ముహూర్తాలు ప్రారంభమయ్యాయి. గురువారం (30వ తేదీ) నుంచి ఈ సంఖ్య ఎక్కువగా ఉంది. జూలై, ఆగస్టు, సెప్టెంబరు మినహా మిగిలిన నెలల్లో ముహూర్తాలు ఉండడం విశేషం.

ఉపాధికి అవకాశం..

ఈ ఏడాది ముహూర్తాలు అధికంగా ఉండడంతో వివిధ వర్గాల వారికి ఉపాధి లభించే అవకాశం ఉంది. దుస్తులు, బంగారం, కిరాణా వ్యాపారాలు జోరందుకోనున్నాయి. లైటింగ్, డెకరేషన్, షామియానాలు, టైలరింగ్, వాయిద్య కళాకారులు, పురోహితులు, వంట మాస్టార్లు, పువ్వుల వాపారులు, ఫొటోగ్రాఫర్లు, ట్రావెల్స్ తదితర రంగాల వారికి మంచి ఆదాయం లభించే అవకాశం ఉంది.

ముందే బుకింగ్..

ఈ ఏడాది వివాహ ముహూర్తాలు ఎక్కువగా ఉండడంతో జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాల్స్‌కు డిమాండ్ పెరిగింది. ఇప్పటికే దాదాపుగా అన్ని చోట్లా కల్యాణ మండపాలు బుక్ అయిపోయాయి. హఠాత్తుగా ముహూర్తాలు పెట్టుకున్న వారు మాత్రం వేదికలు దొరక్క ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో గల పుణ్యక్షేత్రాల్లో కూడా ముందస్తు బుకింగ్ చేసుకుంటున్నారు.

ఈ ఏడాది ముహూర్తాలు ఇలా..

● జనవరి: 22, 23, 24, 25, 29, 30, 31 తేదీలు ● ఫిబ్రవరి: 4, 5, 6, 7, 8, 11, 12, 13, 14, 15, 21 ● మార్చి 4, 6, 7, 8, 11, 12, 13, 14, 15, 21, 22, 25, 26 ● ఏప్రిల్: 2, 3, 4, 5, 7, 8, 10, 11, 12, 14, 15, 21, 22, 23, 29 ● మే:1, 2, 3, 5, 6, 7, 8, 9, 10, 12, 14, 20, 27, 28, 29, 30 ● జూన్: 3, 4, 5, 6, 7, 10, 11, 12 ● జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో ముహూర్తాలు లేవు. ● అక్టోబరు: 14, 16, 17, 18, 20, 21, 22, 23, 25, 30, 31 ● నవంబర్: 7, 13, 14, 18, 19, 20, 21, 22, 26, 27 ● డిసెంబరు: 2, 4, 5, 6, 15, 16, 17, 18, 19, 20, 23, 24, 30

ఈ ఏడాది ఎక్కువ ముహూర్తాలు..

గడిచిన మూడేళ్లతో పోలిస్తే ఈ ఏడాది ఎక్కువ ముహూర్తాలు ఉన్నాయి. పెళ్లిళ్లు, శుభ కార్యక్రమాలకు అనువుగా ఉంది. ఫిబ్రవరి, మార్చి నెలల్లో అధిక సంఖ్యలో పెళ్లిళ్లు జరుగనున్నాయి.

-శ్రీనివాసాచార్యులు, వేంకటేశ్వర స్వామి ఆలయ అర్చకులు

● 'అక్షరం అండగా, పరిష్కారమే అజెండాగా'లో అందిన వినతులపై సానుకూల స్పందన

ఉడా కాలనీలో సమస్యల పరిష్కారానికి కార్యాచరణ సిద్ధం



విజయనగరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉడాకాలనీ, దాని పరిధిలోని ఇతర కాలనీల్లో సమస్యల పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధమవుతోంది. వియనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించారు. 'అక్షరం అండగా, పరిష్కారమే అజెండాగా' కార్యక్రమాన్ని ఆంధ్రజ్యోతి ఈనెల 28న ఉడా కాలనీలోని గాంధీ పార్కులో నిర్వహించిన విషయం విదితమే. కార్యక్రమానికి అధిక సంఖ్యలో ఆయా ప్రాంతాల ప్రజలు హాజరయ్యారు. ఎమ్మెల్యే, కమిషనర్‌లకు సమస్యలపై వినతులు అందజేశారు. ఆయా సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు ఎమ్మెల్యే నిర్ణయించారు.

ఏప్రిల్ సరికి ఓపెన్ జిమ్...

గాంధీ పార్కు అభివృద్ధి, ఓపెన్ జిమ్ ఏర్పాటుపై కాలనీవాసులకు ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, కమిషనర్ నల్లనయ్య స్పష్టమైన హామీ ఇచ్చారు. పార్కు ప్రహరీ పాడైన నేపథ్యంలో దానికి అంచనాలు రూపొందించారు. పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు కసరత్తు మొదలుపెట్టారు. ఈ రెండు పనులు ఏప్రిల్ తొలి వారంలో ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

ఆక్రమణల గుర్తింపు..

ఉడా కాలనీ రోడ్డునకు సంబంధించి అక్రమణల తొలగింపు విషయమై నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య ఆదేశాల మేరకు నగర ప్రణాళిక విభాగం ఏర్పాట్లు మొదలుపెట్టింది. ఆయా రోడ్లలో ఆక్రమణల కోసం మంగళవారం ఆరా తీసింది. త్వరలో ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుట్టే అవకాశం ఉంది.

మందుబాబులపై పోలీసుల దృష్టి..

ఉడా కాలనీకి వెళ్లే రహదారిలో మద్యం దుకాణం ఉండటంతో చీకటి పడితే మందుబాబులు బహిరంగంగా మద్యం సేవించి హల్‌చల్ చేస్తుంటారు. దీని నిర్మూలనకు చర్యలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే పోలీసుశాఖ దానిపై ప్రత్యేక దృష్టి సారించినట్టు సమాచారం. ఉడా కాలనీలో సమస్యలు ప్రాధాన్యత క్రమంలో పరిష్కారమయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి.

డీఎఫ్‌వోగా కొండలరావు

విజయనగరం కలెక్టరేట్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా అటవీ శాఖ అధికారిగా ఆర్.కొండలరావును నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడి డీఎఫ్‌వో వెంకటేశ్‌ను గతంలో శ్రీకాకుళం జిల్లాకు బదిలీ చేశారు. ఆయన జిల్లా ఇన్‌చార్జి డీఎఫ్‌వోగా విధులు నిర్వహిస్తున్నారు.

సమగ్ర శిక్ష ఏపీసీగా రామారావు

విజయనగరం కలెక్టరేట్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఏపీసీగా ఎ.రామారావు బుధవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఈయన పార్వతీపురం ఉద్యాన కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

ప్రతిరోజూ వినతుల స్వీకరణ

విజయనగరం కలెక్టరేట్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి రోజు ప్రజలు నుంచి వినతులు స్వీకరిం టచే కౌంటర్‌ను బుధవారం రాత్రి జేసీ సేతు మాధవన్ ప్రారంభించారు. రాష్ట్రంలో మొట్ట మొదటిసారిగా జిల్లాలో రోజూ వినతుల స్వీకరించనున్నారు. ప్రజలు తమ సమస్యలను ప్రతిరోజూ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటలు వరకూ అందజేయవచ్చు. కార్యక్రమంలోని ఏఈ దేవీప్రసాద్, ఎలక్షన్ సూపరింటెంట్ భాస్కర్‌రావు ఉన్నారు.

బాలికలకు మార్షల్ ఆర్ట్స్‌పై శిక్షణ

విజయనగరం కలెక్టరేట్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్‌పై శిక్షణ ఇవ్వనున్నాయని డీఈవో మాణిక్యం నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్షల్ ఆర్ట్స్‌లో భాగంగా కరాటేను బాలికలకు ఫిబ్రవరి 1 నుంచి 15 వరకూ నేర్పిస్తామన్నారు. గతంలో శిక్షణ ఇచ్చే ఏజెన్సీలు ఫిబ్రవరి 1 లోగా హాజరు కావాలని కోరారు.

రాజీయే రాజమార్గం

గజపతినగరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాజీతో ఎన్నో కేసులను పరిష్కరించకోవచ్చునని న్యాయాధికారి బి.కనకలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక కోర్టులో మార్చిలో జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి సంబంధించి న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రమేశ్‌రాజు, రెడ్డి శ్రీనివాసరావు, రమణాజీ, చప్పా తిరుపతి పాల్గొన్నారు.

ప్రియాంకరెడ్డిపై చర్యలు తీసుకోండి

గుర్ల, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్న ప్రియాంకరెడ్డిపై చర్యలు తీసుకోవాలని చీపురుపల్లి నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు నాగులపల్లి నారాయణరావు కోరారు. బుధవారం ఎస్‌ఐకు ఆమెపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022లో ఎక్కడో జరిగిన దుర్ఘటనను తిరుపతిలో జరిగినట్లు మార్ఫింగ్ చేయడాన్ని తప్పుబట్టారు. తెలుగు యువత మండల అధ్యక్షుడు పైడినాయుడు ఉన్నారు.

అమలులోకి ఎన్నికల కోడ్

నెల్లిమర్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం ప్రకటించిన నేపథ్యంలో ఎన్నికల కోడ్ తక్షణమే అమలులోకి వచ్చిందని తహసీల్దార్ బి.సుదర్శనరావు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో ఎన్నికల కోడ్‌ను పగడ్బందీగా పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు అమలు చేయాలని ఆయన ఆదేశించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపు

నెల్లిమర్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూతికపేట ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ బి.కొండమ్మను విధుల నుంచి తొలగించినట్లు ఏపీవో అరుణకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని నెలలుగా విధులకు గైర్హాజరు కావడంతో పీడీ ఆమెను తొలగించారని ఏపీవో పేర్కొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో తనిఖీ

గంట్యాడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని బుధవారం జడ్పీ సీఈవో సత్యనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో సిబ్బంది మాట్లాడారు. ఎంపీడీవో రమణమూర్తి ఉన్నారు.

పథకాల అమలుపై సభ్యులు ఆరా

కొత్తవలస, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల అమలుపై సభ్యులు అధికారులను ప్రశ్నించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ అధ్యక్షత మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు హాజరయ్యారు. సమావేశంలో తహసీల్దార్ బి.నీలకంఠరావు ఎంపీడీవో రమణయ్య పాల్గొన్నారు.

మందకృష్ణకు అభినందనలు

రాజాం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అవిశ్రాంత పోరాట యోధుడు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు వచ్చినందుకు పట్టణ బీజేపీ ప్రెసిడెంట్ జొన్నాడ రంజిత్ ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. 30 ఏళ్ల బడుగు బలహీన వర్గాలు అభ్యున్నతికి ఆయన చేస్తున్న పోరాటానికి గుర్తుగా కేంద్ర ప్రభుత్వం గుర్తించి పద్మశ్రీ అవార్డు ప్రకటించిందన్నారు.

భవనానికి అనుమతుల్లేవ్

జామి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అలమండలో వైసీపీ నాయకుడు నిర్మించిన కన్వెన్షన్ భవనానికి ఎలాంటి అనుమతులు లేవని టీడీపీ నాయకుడు అప్పలనాయుడు అన్నారు. దీనికి పంచాయతీ, ఉడా నుంచి ఎలాంటి అనుమతులు లేకున్నా దర్జాగా కన్వెన్షన్ నిర్వహిస్తున్నారని ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను సమాచార హక్కు చట్టం ద్వారా ఆ భవనానికి సంబంధించిన వివరాలు సేకరించానన్నారు. ఈ నిర్మాణానికి అనుమతులు ఇవ్వలేదని రాతపూర్వకంగా అధికారులు సమాచారం అందించారన్నారు. అయితే దాదాపు మూడేళ్లు కావసున్నా అడ్డగోలుగా నిర్మించిన భవనంపై అధికారులు చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు

సోషల్ ఆడిట్‌లో ఆద్యంతం అభ్యంతరాలే..

జామి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జామి మండలంలో బుధవారం ఉపాధి హామీ పనులపై నిర్వహించిన సోషల్ ఆడిట్‌లో ఆద్యంతం అభ్యంతరాలే వ్యక్తమయ్యాయి. కార్యక్రమంలో డ్వామా పీడీ శారదాదేవి పాల్గొన్నారు. తొలుత ఏపీవో కిరణ్మయి అధ్యక్షతన నిర్వహించి సోషల్ ఆడిట్‌లో 25 పంచాయతీలలో జరిగిన ఉపాధి పనులు, పెన్షన్‌లు, హౌసింగ్, ఎవెన్యూ ప్లాంటేషన్ అంశాలను వివరించారు. అయితే దాదాపు అన్ని పంచాయతీల్లో మేట్లు, క్షేత్ర సహాయకులు చేసిన పొరపాట్లు వేతనదారులు వివరించారు. పనికి రాక పోయిన వారికి వేతనాలు జమ చేశారని ఆరోపించారు. 2020లో చనిపోయిన వ్యక్తికి కూడా మస్తరు వేశారని పీడీకి ఫిర్యాదు చేశారు. కార్యక్ర మంలో డ్వామ విజిలెన్స్ అధికారి పి.వెంకటరమణ, క్వాలిటీ అధి కారి శ్రీనివాస్ కుమార్, ఏపీడీలు శ్రీనువాసరావు, మన్మథరావు, ఎంపీడీవో అప్పల నాయుడు తదితరులున్నారు.

జగన్ హయాంలో ఆర్థిక విధ్వంసం: కర్రోతు


బంగార్రాజు

భోగాపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ హయాంలో రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరిగిందని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో విమర్శించారు. ఆయన హయాంలో రూ.22 వేల కోట్ల మేర ఆరోగ్యశ్రీ, ధాన్యం, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చంద్రబాబు ప్రభుత్వం చెల్లించిందన్నారు. అప్పులు కూడా పుట్టని స్థితి ఏర్పడిందన్నారు. ఏడాదికి రూ.71 వేల కోట్లు అసలు, వడ్డీ చెల్లించాలని ఇది చంద్రబాబు ప్రభుత్వానికి గుదిబండగా మారిందన్నారు. జగన్ విలాసాలకు రూ.19871.35 కోట్ల దుబారా చేశారన్నారు. గత ఐదేళ్లలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని జగన్‌రెడ్డి రూ.8 లక్షల కోట్ల ప్రజా ధనాన్ని కొల్లగొట్టారన్నారు. గనులు, భూ కేటాయింపులతో రాష్ట్రంలో విధ్వంసం సృష్టించారన్నారు.

అమరవీరులకు నివాళులు



నివాళి అర్పిస్తున్న దృశ్యం

నెల్లిమర్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల జూట్ మిల్లు అమర వీరుల 31వ వర్ధంతిని నగర పంచాయతీ జరజాపుపేటలోని స్థారక స్థూపం వద్ద బుధ వారం సాయంత్రం జరిగింది. ఇఫ్టూ ఆధ్వర్యంలో అమర వీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమం లో ఇఫ్టూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.గోపాలం మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలను మరువలేమన్నారు. కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా నాయకులు అప్పలరాజు, గీత, వెంకటలక్ష్మి, అప్పలసూరి, నామాల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు

అప్రోచ్ రోడ్డుకు స్థల పరిశీలన

భోగాపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలం ముంజేరు సమీపంలో అప్రోచ్ రోడ్డు ఏర్పాటుకు ఆర్డీవో దాట్లకీర్తి బుధవారం స్థలపరిశీలన చేశారు. ఎయిర్‌పోర్టుకు సంబందించిన సుమారు 11 ఎకరాల స్థలం ఉంది. ఇందులో ఎయిర్‌పోర్టు సిబ్బందికి సంబంధించి క్వార్టర్స్ నిర్మిస్తున్నారు. అయితే దానికి రహదారి సౌకర్యం లేదు. దీంతో జీఎంఆర్ సంస్థ ప్రభుత్వాన్ని ఆశ్రయించ డంతో ఆర్డీవో దాట్ల కీర్తి, తహసీల్దార్ సురేష్ స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో హెచ్‌డీటీ గాంధీ, సర్వేయర్ మధుకేశవరావు, జీఎంఆర్ సంస్థ ప్రతినిధి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

రాజాం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన కనిపించింది. జాబ్‌మేళాకు 178 మంది హజరయ్యారు. వీరిలో 63 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మరో 12 మంది తదుపతి రౌండ్‌కు ఎంపికయ్యారని ఐటీఐ ప్రిన్సిపాల్ బండారు భాస్కరరావు తెలిపారు. జాబ్‌మేళాలో స్కిల్ డెవలప్‌మెంట్ ప్లేస్‌మెంట్ అధికారి టి.భాస్కర్. యశ్వంత్, సీడాప్ సిబ్బంది పాల్గొన్నారు.

స్కాట్ మేళాకు కుమరాం విద్యార్థులు

జామి జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలో వారం రోజుల పాటు నిర్వహించే జాతీయ డైమండ్ స్కౌట్ మేళాకు మండలంలోని కుమరాం జడ్పీ ఉన్నతపాఠశాలకు చెందిన హేమంత్‌కుమార్, ఎన్.భరత్, జె.జశ్వంత్ ఎం పికైనట్లు స్కౌట్ మాస్టార్ గుండాల శ్రీనువాసరావు తెలిపారు. వీరిని డీఈవో మాణిక్యాలనాయుడు హెచ్‌ఎం పద్మావతి అభినందించారు.

అక్షరాస్యులను చేయండి

గంట్యాడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) కేంద్ర ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్రమం ద్వారా నిరక్షరాసులను అక్షరాస్యులుగా మార్చాలని జిల్లా వయో జన విద్యాశాఖ డిప్యూటీ డైరక్టరు సోమేష్ పిలుపునిచ్చారు. బుధవారం స్దానిక మండల సమాఖ్య భవనంలో గ్రామైక్య సంఘాలకు చెందిన వీవోలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీవో లక్ష్మి, ఎమ్మార్పీ హరీష్, వెలుగు ఏపీఎం సులోచనదేవి తదితరులు ఉన్నారు.

కల్లుగీత కార్మికులకు 16 మద్యం దుకాణాలు

విజయనగరం క్రైం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో 16 మద్యం షాపులు కల్లుగీత కార్మికులకు కేటాయించినట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఉమ్మడి జిల్లాల సూపరింటెండెంట్ బి.శ్రీనాధుడు ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలో ఎ-4 దుకాణం (శెట్టి బలిజ), బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలో ఎ-4 దుకాణం (యాత), రాజాం నగర పంచాయితీ పరిధిలో (శెగిడి), బొబ్బిలి రూరల్ పరిధిలో (యాత), భోగాపురం పరిధిలో (శెగిడి), నెల్లిమర్ల మండల పరిధిలో (యాత), కొత్తవలస మండల పరిధిలో (యాత), జామి మండల పరిధిలో (శెట్టి బలిజ), రాజాం రూరల్ పరిధిలో (యాత), పూసపాటిరేగ పరిధిలో (శెగిడి), విజయనగరం రూరల్ పరిధిలో (యాత), గజపతినగరం మండల పరిధిలో (యాత), మెరకముడిదాం మండల పరిధిలో (యాత), గరివిడి మండల పరిధిలో (శ్రీశయన), సంతకవిటి మండల పరిధిలో ఎ-4 దుకాణం (యాత), చీపురుపల్లి మండల పరిధిలో ఎ-4 దుకాణం(సొండి)లకు కేటాయిస్తూ ప్రభుత్వం గజిట్ విడుదల చేసిందని తెలిపారు. దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలు, లైసెన్స్ ఫీజు రూ.21.66 లక్షలు, రెండో సంవత్సరం లైసెన్స్ ఫీజు రూ.35.74 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఎ-4 దుకాణాలకు వేలం లాటరీ పద్ధతిలో నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనేవారు ఫిబ్రవరి 6వ తేదీ సాయంత్రం 5 గంటలలోను దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 7న ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో కలెక్టర్ అంబేడ్కర్ సమక్షంలో లాటరీ ప్రక్రియ జరుగుతుందన్నారు. విజయనగరం జిల్లాలోని పది స్టేషన్లు, విజయనగరం-1, 2, భోగాపురం, చీపురుపల్లి, నెల్లిమర్ల, గజపతినగరం, ఎస్‌కోట, కొత్తవలస, బొబ్బిలి, రాజాం ఎక్సైజ్ స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని వివరించారు.

విభిన్న ప్రతిభావంతులను స్ఫూర్తిగా తీసుకోండి


పూజలు నిర్వహిస్తున్న స్వామిజీ

విజయనగరం దాసన్నపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులు స్వతహాగా జీవనోపాధి పొందేందుకు క్లాత్ బ్యాగులు తయారు చేస్తున్నారని వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని సాధు పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి అన్నారు. బుధవారం హెల్పింగ్ హెండ్స్ హిజ్రాస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13 ఏళ్లుగా హెల్పింగ్ హెండ్స్ సంస్థ సామాజికంగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కొండబాబు సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హిందూ ధర్మ రక్షాసమితి రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాలరావు, వర్రి ప్రకాశ్ పాలొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధం


ఆక్రమణలు గుర్తిస్తున్న సిబ్బంది

రాజాం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాజాం మున్సిపాలిటీ పరిధిలోని ఆక్రమణలపై అధికారులు కొరడా ఝుళిపించనున్నారు. మున్సిపాలటీ పరిధిలోని కాలువలు, గెడ్డలు, చెరువులు సర్వే రికార్డుల ప్రాప్తికి సర్వే నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఆక్రమణలు గుర్తించి వాటిని తొలగించేందుకు రంగం సిద్ధం చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు తెలిపారు. ఇందులో భాగంగా తొలుత ఐదు కాలువలు, రెండు చెరువుల్లో ఆక్రమణలు గురిస్తున్నామన్నారు. డోలపేట కూడలి నుంచి వాసవినగర్ మీదగా అంతకాపల్లికి వెళ్లే కాలువ, సారధి రోడ్డులో కాలువ, ఆదర్శనగర్‌లో కాలువ, జీఎంఆర్‌ఐటీకి ఆనుకుని ఉన్న కాలువ, మల్లమ్మ చెరువు, రంగప్ప చెరువుల్లో సర్వే నిర్వహించి ఆక్రమణలు తొలగిస్తామన్నారు. అందుకు తగ్గట్టు బుధవారం ఎట్టణ ప్రణాళికా అధికారి తేజేశ్వరరావు. సర్వేయరు సత్యనారాయణ. శానిటరీ ఇన్‌స్పెక్టర్ చేగొండి ప్రసాద్ తదితరులు డోలపేట కూడలిలో కాలువ నిర్మాణాన్ని పరిశీలించారు.

రోడ్డు నిర్మాణానికి హామీ ఇవ్వండి

● ఎమ్మెల్యేని అడ్డుకున్న ఆతవ గ్రామస్థులు



ఎమ్మెల్యే కారును అడ్డుకుంటున్న గ్రామస్థులు

వేపాడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆతవ రోడ్డు పనులు పూర్తి చేయాలని అదే గ్రామస్థులు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని బుధవారం అడ్డుకున్నారు. స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రహదారి పనులు పూర్తి చేయాలని మూడురోజులుగా గ్రామస్థులు ఆందోళన చేస్తున్నారు. బుధవారం ఎమ్మెల్యే వేపాడ వచ్చి తిరిగి వెళ్తున్న విషయాన్ని తెలుసుకున్న గ్రామస్థులు ఆమెను అడ్డుకున్నారు. దాంతో ఆమె 15 రోజుల్లో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో దళిత నాయకులు ఆతవ ఉదయభాస్కర్, కెర్రి దేముడు తదితరులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్‌కు స్థల పరిశీలన

శృంగవరపుకోట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పట్టణంలో అన్నా క్యాంటిన్ ఏర్పాటు కానుంది. బుధవారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, జడ్పీ సీఈవో సత్యనారాయణ, తహసీల్దార్ ఎం.అరుణ కుమారి, ఎంపీడీవో సతీష్ పలుచోట్ల స్థల పరిశీలన చేశారు. పాత బస్టాండ్ వద్ద స్థలం అన్న క్యాంటీన్ ఏర్పాటుకు అనువుగా ఉంటుందని గుర్తించారు.

నగరంలో కొత్తగా 250 ఎల్‌ఈడీలు


ఎల్‌ఈడీ దీపాన్ని అమరుస్తున్న సిబ్బంది

విజయనగరం రింగురోడ్డు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని కొత్తగా 250 ఎల్‌ఈడీ విద్యుత్ దీపాలు ఏర్పాటవుతున్నాయి. గత ఏడాది అక్టోబరులో జరిగే పైడిమాంబ సిరిమానోత్సవానికి ముందే ఏర్పాటు కావాలి. కాని పూర్తిస్థాయిలో లైట్లు రాకపోవడం, మరోవైపు లైట్లు బిగించే క్లాంపులు కూడా రాకపోవడంతో ఈ లైట్లు ఏర్పాటు కాలేదు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు నగరంలో విద్యుత్ దీపాలకు సంబంధించి రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ దృష్టికి గతంలో తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో తొలి విడతగా నగరంలోని 50 డివిజన్‌లకు ఒక్కొక్క డివిజన్‌కు ఐదేసి చొప్పున ఎల్‌ఈడీ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించి, మంగళవారం నాడు నగరంలోని పలు డివిజన్లలో ఈ విద్యుత్ దీపాలు ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది. విజయనగరంలోని 50 డివిజన్‌ల పరిధిలో 20,052 విద్యుత్ దీపాలు ఉండగా, తాజాగా మరో 250 విద్యుత్ దీపాలు ఏర్పాటు కానున్నాయి.

ఒకేరోజు మూడుచోట్ల దొంగతనం

శృంగవరపుకోట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పట్టణంలో మంగళవారం అర్ధరాత్రి దాటాక మూడుచోట్ల దొంగతనాలు జరిగాయి. సీతంపేట శివారులోని ఓ ప్రైవేట్ కొరియర్ సర్వీస్ కార్యాలయంలో రూ.70 వేల నగదు అపహరణకు గురైనట్టు సిబ్బంది చెబుతున్నారు. సుమారు 2.30 గంటల సమయంలో నలుగురు వ్యక్తులు షెట్టర్లు ఎత్తి లోపలకు చొరబడినట్టు సీసీ కెమెరాలో రికార్డు అయింది. 3 గంటల సమయంలో ఒన్‌వే ట్రాఫిక్ వద్ద వున్న ఓ మద్యం దుకాణంలోని కౌంటర్‌లోని రూ.2వేలు, 8ఫుల్ బాటిల్ మద్యం సీసాలను ఎత్తికెళ్లినట్టు దుకాణ నిర్వాహకులు తెలిపారు. 4 గంటల సమయంలో పుణ్యగిరి ప్రైవేట్ కళాశాల సమీపంలోని విశాఖ-అరకు రోడ్డుకు అనుకుని ఉన్న కిరాణా దుకాణంలో దాదాపు రూ.15 వేలు నగదు, 6 నూనె డబ్బాలు, 4 బస్తాల బియ్యం అపహరించారని యజమాని తెలిపారు. ఒకేరోజు మూడుచోట్ల దొంగతనాలతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. విజయనగరం నుంచి క్లూస్ టీం వచ్చిన ఘటన స్థలాలను పరిశీలించింది. పోలీస్‌లు దొంగతనాలపై ఆరా తీశారు. కేసులు నమోదు చేస్తామని సీఐ వి.ఎన్.మూర్తి తెలిపారు.

సారాతో మహిళ అరెస్టు

కొత్తవలస, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సారాతో మహిళను అరెస్టు చేసి కోర్టుకు తరలించామని కొత్తవలస ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ జీఎస్ రాజశేఖరనాయుడు తెలిపారు. వేపాడ మండలం కృష్ణారాయుడుపేటలో బుధవారం నిర్వహించిన దాడిలో సిమ్మ ఈశ్వరమ్మను 5 లీటర్ల సారాతో పట్టు కున్నామని సీఐ తెలిపారు.

లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

శృంగవరపుకోట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మేథ్స్ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్.కేశవరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 3 సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఎమ్మెస్సీ గణితంలో 55 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు.

గృహ నిర్మాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

శృంగవరపుకోట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోని శృంగవరపుకోట నియోజకవర్గంలోని అర్హులైన కుటుంబాలకు గృహ నిర్మాణాల మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. పీఎంఎవై యూడీఏ-ఎన్టీఆర్ హౌసింగ్ ఫర్ ఆల్ పథకం ద్వారా మంజూరుకు సచివాలయాల్లో దరఖాస్తులు అందజేయాలన్నారు.

● లక్కవరపుకోట: పేదలకు ఇళ్లకు ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తోందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. బుధవారం ఆమె హౌసింగ్ డీఈ, ఏఈలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీఈ శ్రీనివాసరావు, ఏఈ ఉమామహేశ్వరరావు, గొరపల్లి రాము, చొక్కాకుల మల్లునాయుడు పాల్గొన్నారు.

ఓబీసీలకు న్యాయం చేయండి

కొత్తవలస, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఓబీసీలకు సంక్షేమ పథకాల అమలు జరిగే విధంగా చూడాలనిఈస్టుకోస్ట్ రైల్వే ప్రిన్సిపాల్ చీఫ్ పర్సనల్ అధికారి సిద్ధార్థ కాటిని ఆలిండియా ఈస్టుకోస్ట్ రైల్వే ఓబీసీ రైల్వే ఎంప్లాయిస్ యూనియన్ పి.రాజశేఖర్ కోరారు. విశాఖలో ఆయనను బుధవారం కలిసి వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఓబీసీ నాయకులు వి.జయరాం, జి.నాగరాజు పాల్గొన్నారని తెలిపారు.

నేటి వరకే ఇంటర్ తత్కాల్ ఫీజుకు గడువు

రాజాం రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మార్చి ఒకటో తేదీ నుంచి 20 వరకు జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షల ఫీజు చెల్లించేందుకు ఈనెల 30 గడువుగా బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ కార్యదర్శి క్రితికా శుక్లా ఉత్వర్వులు జారీ చేశారు. ఈమేరకు ఆర్జేడీలు, డీవీఈవోలు, ఆర్ఐవోలకు ఈనెల 28న ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకూ ఇంటర్ ఫీజు చెల్లించని రెగ్యులర్, సప్లిమెంటరీ పరీ క్షలకు హాజరుకానున్న విద్యార్థులు తత్కాల్ పద్ధతిలో రూ.3 వేలు ఫీజుగా చెల్లిం చవచ్చని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అలాగే టెన్త్ పాసైన విద్యార్థులు రెండేళ్ల పాటు గ్యాప్ ఉంటే ప్రైవేటుగా ఆర్ట్స్ గ్రూపుల్లో ఏకకాలంలో ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకెండ్ ఇయర్ పరీక్షలకు ఇదే మొత్తం ఫీజుగా చెల్లించి పరీక్షలకు హాజరుకావచ్చని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

ప్రమాదంలో ప్రభుత్వ విద్య: ఏపీటీఎఫ్

రాజాం రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాఠశాలల స్వరూపం మార్చడం వల్ల ప్రభుత్వ విద్య ప్రమాదంలో పడుతుందని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నుపాటి మంజుల, కె.భానుమూర్తి అన్నారు. బుధవారం రాజాంలోని ఓ కల్యాణమండపంలో ఏపీటీఎఫ్ రాజాం జోన్ ఆధ్వర్యంలో 'మారుతున్న పాఠశాల స్వరూపాలు- నూతన సవాళ్లు' అంశంపై సెమినార్ నిర్వహించారు. కార్యక్రమంలో విజయనగరం జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ బుకారీబాబు, పాల్తేరు శ్రీనివాసరావు, శ్రీకాకుళం జిల్లాశాఖ అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్, రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటపతిరాజు, రౌతు గణపతిరావునాయుడు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు నాశనం

చీపురుపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలు జీవితాన్ని నాశనం చేస్తాయని చీపురుపల్లి డీఎస్పీ ఎస్. రాఘవులు అన్నారు. పట్టణంలోని గాయత్రి కళాశాలలో బుధవారం నిర్వహించిన మాదక ద్రవ్యాల నిరోధంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీఐ శంకరరావు, ఎస్ఐ దామోదరరావు, ప్రిన్సిపాల్ దాసరి శివప్రసాద్ పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలి

నెల్లిమర్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయితీలోని అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి మొయిద పాపారావు కోరారు. బుధవారం నెల్లిమర్లలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఆయనతో అప్పలనాయుడు, సత్యనారాయణ తదితరులున్నారు.

'టీడీపీకి అధికార దుర్వినియోగం చేతకాదు'

గుర్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి అధికార దుర్వినియోగం చేయడం చేతకాదని ఆ పార్టీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి వి.సన్యాసినాయుడు, జిల్లా కార్యదర్శి కిరణ్‌కుమార్‌రాజు, మండల అధ్యక్షుడు సీహెచ్. మహేశ్వరరావు, సన్యాసినాయుడు, అప్పల రామునాయుడు అన్నారు. బుధవారం గుర్ల మండల పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో జడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు మాట్లా డిన వారు కౌంటర్ ఇచ్చారు. అందరిని సమానంగా చూస్తామని, ఎవరిని కించపరిచలేదని, అధికారులను గౌరవిస్తూ చట్టప్రకారం వెళ్లామని మండల తెలుగుదేశం పార్టీ నాయకులు అన్నారు.

ఘనంగా తీర్థ మహోత్సవాలు

వేపాడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వేపాడ గ్రామ దేవతలు పరదేశమ్మ, ముత్యాలమ్మ తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. రెండో రోజు ఉదయం మహిళలకు వివిధ పోటీలు నిర్వహించారు. మధ్యాహ్నం ఎడ్ల పరుగు పందెం పోటీలు నిర్వహించారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగించండి

రాజాం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రూ.లక్షలు వెచ్చించి గ్రామాల్లో చెత్త కష్టాలు లేకుండా చేయాలని నిర్మించిన చెత్త సంపద కేంద్రాలను నిరుపయోగంగా ఉంచడం తగదని ఎంపీడీవో శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం బొద్దాంలో నిర్మించిన కేంద్రాన్ని యన పరిశీలించారు. ప్రతిరోజూ చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం చిన్నారులకు ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలించారు.

కళా సోదరుడి అంత్యక్రియలు పూర్తి


సత్యనారాయణ అంతిమయాత్ర

రేగిడి, జనవరి 29, (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి ఎమ్మెల్యే, మాజీ మంత్రి కిమిడి కళావెంకట్రావు సోదరుడు కిమిడి సత్యనారాయణ అంత్యక్రియలు బుధవారం ఆయన స్వగ్రామం రేగిడిలో నిర్వహించారు. కళా, ఆయన సోదరులు మాజీ ఎమ్మెల్యే కిమిడి గణపతిరావు, మాజీ ఎంపీపీ కిమిడి రామకృష్ణం నాయుడు, కిమిడి కుటుంబ సభ్యులు, అభిమానులు, రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల వారు ఆయన అంతియాత్రలో పాల్గొన్నారు.

గాంధీపై మమకారం

● రాజాంలో ఓ దినసరి కూలి ఏడాదంతా సేవలో నిమగ్నం


గుడిలో గాంధీకి విగ్రహం

రాజాం రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి):రాజాం పట్టణానికి చెందిన అలమలకల పైడిరాజు అలియాస్ వెంకన్న మూడు దశాబ్దాలుగా మహాత్మా గాంధీపై మమకారంతో ఏడాది పొడవునా ఆయన సేవలో తరిస్తున్నాడు. ఆయనో దినసరి కూలీ. రోజంతా కష్టపడితే రెండొందలు కూడా రాని దుస్థితి ఆయనది. మహాత్ముడికి పూజతోనే ఆయన దినచర్య ప్రారంభమవుతుంది. సుమారు 30 ఏళ్ల క్రితం పట్టణంలోని కుమ్మరివీధిలో ఓ ఇంటి గడపలో ఉన్న మహాత్ముడి విగ్రహాన్ని చూసి చలించిపోయిన వెంకన్న ఆ విగ్రహాన్ని తాను అద్దెకుంటున్న ఇంటి ఎదురుగా పెట్టి పూజలుచేయడం ప్రారంభించారు. కాలక్రమంలో పొదుపు చేసుకున్న రూ.500 గాంధీజీకి చిన్నపాటి గుడికట్టేందుకు ఉపయోగించి మహాత్ముడిపై తనకున్న మమకారాన్ని చాటుకున్నారు. ఏటా స్వాతంత్ర్య దినోత్సవంతోపాటు బాపూజీ జయంతి, వర్ధంతి రోజున కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా పెట్టుకున్నారు. దాతల చేయూతతో మహాత్ముడికి పూజలు చేయడంతోపాటు కనీసం వెయ్యిమందికి అన్నదానం చేస్తూ నేటితరానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇదంతా ఒకెత్తు కాగా 1996లో శెగిడివీధిలో మహాత్మాగాంధీకి వెంకన్న గుడి కట్టడంతో పాటు కార్యక్రమాలు నిర్వహించడంతో శెగిడివీధిని కాలక్రమంలో గాంధీవీధిగా మారింది. 1990లో ఓ నాటక సమాజం నాటక ప్రదర్శన కోసం తెచ్చి ఓ ఇంటి అడుగుపై వదిలేసిన గాంధీజీ విగ్రహానికి నేడు నిత్యపూజలు జరుగుతున్నాయి.

జగన్ వల్ల ఆర్థిక వ్యవస్థ దివాళా: ఎమ్మెల్యే

బొబ్బిలి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ అసమర్థ, అపరిపక్వత పరిపాలన వల్ల ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దివాళా తీసిందని బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) బుధవారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తంచేశారు. రూ. పది లక్షల కోట్లు అప్పుతో ఏడాదికి రూ.71 వేల కోట్ల అసలు, వడ్డీ చెల్లింపు భారం పడుతోందని తెలిపారు. ఏడు నెలల్లో ఆరోగ్యశ్రీ, ధాన్యం బకాయిలు, ఫీజు రీఎంబర్స్‌మెంట్ వంటి గత ప్రభుత్వ బకాయిలు రూ.22 వేల కోట్లను చంద్రబాబు ప్రభుత్వం చెల్లించిందని పేర్కొన్నారు. అప్పులు కూడా పుట్టని పరిస్థితి దాపురించిందని తెలిపారు. ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేసిన ఘనతను జగన్ మూటగట్టుకున్నారని ధ్వజమెత్తారు.

కాశీకి పాదయాత్ర


పాదయాత్ర నిర్వహిస్తున్న యాత్రీకులు

బొబ్బిలి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కాశీ వెళ్లేందుకు నలుగురు యాత్రీకులు పాదయాత్ర నిర్వహిస్తున్నారు. ఈమేరకు ఈనెల 25న అనకాపల్లి జిల్లా వెదురుపర్తి నుంచి బయలు దేరిన యాత్రీకులు బుధవారం బొబ్బిలి చేరుకున్నారు. అనకాపల్లి జిల్లా కశింకోట మండలంలోని వెదురుపర్తి గ్రామానికి చెందిన అర్చకుడు దొంతుకుర్తి స్వర్ణ నాగేశ్వరరావు,కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన రిటైర్డ్ విద్యుత్ ఉద్యోగి పుల్లేటికుర్తి సత్యఆంజనేయరావు, వెదురుపర్తికి చెందిన రైతుల అల్లవరపు హరిబాబు, పాతరపల్లి రాజు పాదయాత్ర చేస్తున్నారు.

గ్రాట్యూటీ అమలుచేయాలి

రామభద్రపురం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్‌ను క్రమబద్ధీకరించి, గ్రాట్యూటీని అమలుచేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు బలసా శ్రీను కోరారు. బుధవారం ఆరికతోటలో అంగన్‌వాడీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బందికి కనీస వేతనంగా రూ.26వేలు అమలుచేయాని, గ్రాట్యూటీ ప్రకటించాలని కోరారు. అంగన్‌వాడీలకు బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలన్నారు. సుప్రీంకోర్టు సూచనల మేరకు గ్రాట్యూటీ చెల్లించే విధంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు వినతిపత్రాలు పంపిస్తున్నామని చెప్పారు. అంగన్‌వాడీలు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు కూనిశెట్టి సత్యవతి, కళా, అరుణ, రమణి, లక్ష్మి, శ్రీదేవి, రమాపాల్గొన్నారు.

ఫిర్యాదులు పరిష్కరించండి

● స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నూకరాజు


రికార్డులు పరిశీలిస్తున్న నూకరాజు

రామభద్రపురం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులన్నీ సత్వరమే పరిష్కరించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నూకరాజు కోరారు.బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూసదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన ఇప్పటివరకు ఎన్నిసమస్యలు పరిష్కరించారు, ఇంకా ఏ విధమైన సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్న విషయాలను రెవెన్యూ అధికారులను అడిగితెలుసుకున్నారు. రైతుల నుంచి వచ్చిన 196 దరఖాస్తులను కంప్యూటర్‌లో ఆన్‌లైన్ చేసి పరిష్కరించామని తహసీల్దార్ ఆకుల సులోచనారాణి తెలిపారు.మిగిలిన సమస్యలు కూడా పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌డీటీ శశిధర్ పాల్గొన్నారు.

ఆటో ఢీకొని బాలికకు గాయాలు

బొబ్బిలి జనవరి 29 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలో నీళ్లట్యాంకు సమీపంలో ఇంట్లో నుంచి రోడ్డు మీదకు వస్తున్న బాలిక కింతలి దాక్షాయని కి బుధవారం రాత్రి ఆటోఢీకొంది. దీంతో తలకు గాయంకావడంతో సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేయించిన అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయనగరం తరలించినట్లు సీఐ కటకం సతీష్‌కుమార్ తెలిపారు. ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కల్లాల్లో ధాన్యం.. అన్నదాతకు కన్నీరు

●చివరి దశలో కొనుగోలు ప్రక్రియ ●టెన్షన్ పడుతున్న సంతకవిటి మండలం రైతులు


పోతురాజుపేటలో కల్లంలో కొనుగోలుకు సిద్ధంగా ఉన్న ధాన్యం

సంతకవిటి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సంతకవిటి మండలంలోని రైతులు వేడుకుంటున్నారు. నూర్పులు పూర్తికావడంతో బస్తాల్లో కల్లాల్లోనే రోజుల తరబడి ఉండడంతో అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈనేపథ్యంలో అధికారులు పట్టించుకోకపోవడంపై నిరాశ వ్యక్తంచేస్తున్నారు. ధాన్యం కొనుగోలు సీజన్ చివరి దశలో కష్టాలు పడుతున్నారు. మిల్లర్ల తీరుపై అధికారులకు విన్నవిస్తే మండలంలో టార్గెట్ అయిపోయిందని జారుకుంటున్నారు. మండల రైతులకు ఖరీఫ్ సీజన్ పెద్దగా కలిసి రాలేదు. కోతల సమయంలో తరచూ వానలు పడడంతో చాలా పంటను కోల్పోయారు. ఉన్న పంటనైనా అమ్ముకుందామని మిల్లర్లను ఆశ్రయిస్తే వారి నుంచి నిరాశ ఎదురవుతోంది. మండలంలో సుమారు 43,540 మెట్రిక్ టన్నుల వరిని పండించారు. దీనిలో 80 శాతం 34,832 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనాల్సి ఉండగా, 21,920 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. 13,395 మెట్రిక్ టన్నుల ధాన్యం పరిస్థితి అయోమయంలో పడింది. మండవకురిటి, సిరిపురం, వాసుదేవపట్నం, మంతిన, మామిడిపల్లి, మోదుగులపేట తదితర గ్రామాల రైతుల నుంచి పంటను తీసుకోవడం లేదు. కొనుగోలు చేయాలని కోరుతూ అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. కానీ వారి నుంచి సానుకూల స్పందన ఉండడం లేదు.

పట్టించుకోవడం లేదు



ఆరుగాలం కష్టపడి సాగుచేసిన వరి పంట అమ్మకానికి అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వం సీజన్ మొదట్లో ఉన్నంత స్పీడుగా ఇప్పుడు స్పందించడం లేదు. ధాన్యం అమ్ముకుందామంటే ప్రభుత్వ పరంగా కొనుగోలు చేసే నాథుడే కరువయ్యారు. అధికారులను అడిగితే టార్గెట్ లేదు అంటూ జారుకుంటున్నారు.

\- మొయ్యి శ్రీధర్, రైతు

సిబ్బంది లేరు.. వసతి లేదు

●నిలిచిపోయిన భవన నిర్మాణం ● ఇదీ ఆరికతోట గ్రామ సచివాలయంలో పరిస్థితి



పాత పంచాయతీ భవనంలో గ్రామ సచివాలయం, ఆర్బీకే కార్యాలయాలు నిర్వహిస్తున్న దృశ్యం

రామభద్రపురం,జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరికతోట గ్రామ సచివాలయంలో వసతితోపాటు సిబ్బంది కొరత వేధిస్తోంది. దశాబ్దాలకాలం కిందట నిర్మించిన పాత పంచాయతీ కార్యాలయంలో సచివాలయంతోపాటు రైతు భరోసా కేంద్రం నిర్వహిస్తున్నారు. ఈ రెండు కార్యాలయాలకు సంబంధించిన సిబ్బందికి ఇరుకైన గదులు సరిపోకపోవడంతో ఇబ్బందిపడుతున్నారు. ఈ నేపథ్యంలో సచివాలయ భవనం పనులు నిధుల కొరత వల్ల నిలిచిపోయింది. కొద్ది నెలలుగా సచివాలయంలో డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో సచివాలయానికి పనులపై వచ్చిన వారు అగచాట్లకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సచివాలయం భవన నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావడంతోపాటు సిబ్బందిని కూడా నియమించాలని ఆరికతోట గ్రామస్థులు కోరుతున్నారు.

పక్కిలో పశువైద్య శిబిరం

బొబ్బిలి రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పక్కిలో బుధవారం గర్భకోశ వ్యాధుల చికిత్స పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీపీ శంబంగి లక్ష్మి మాట్లాడుతూ పాడి రైతులు పశువైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి ఎల్.సుధాకర్ మాట్లాడుతూ పాడి రైతుల యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. లేగ దూడ దశ నుంచే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 32 పశువులకు గర్భకోశ వ్యాధి నిర్ధారణ పరీక్షలు, 162 దూడలకు నులు పురుగుల మందు, నట్టల నివారణ మందులు వేశామని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ డి.అనిత పాల్గొన్నారు.

మాతృభాషలో బోధించాలి

రామభద్రపురం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఐదో తరగతి వరకు మాతృభాష, ప్రాంతీయ బాషల్లో బోధించాలని ఏపీటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు మడక బలరాం నాయుడు కోరారు. బుధవారం రామభద్రపురంలో విలేకరులతో మాట్లాడుతూ కేవలం ఆంగ్లమాధ్యమంలోనే బోధన వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ విషయంపై ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఫౌండేషన్ పాఠశాలల్లో ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి 1:20గా పరిగణించాలని తెలిపారు. ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యలో సంబంధం లేకుండా హెచ్‌ఎం, సీనియర్ అసిస్టెంట్, పీఈటీ పోస్టులు కేటాయించాలని, హైస్కూల్ ప్లస్‌ను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షులు బొప్పే రవి, ఏపీటీఎఫ్ నాయకులు కాగాన సత్యారావు, సువ్వాడ వెంకటప్పలనాయుడు, గేదెల మునలయ్య, వసంతుల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మంచు గుబులు

(5వ పేజీ తరువాయి)

వరకూ ఆశించే పలు చీడపీడల నివారణ కోసం ముందుగానే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

తేనె మంచు పురుగు

ఇవి పూత, కాయ దశలో అధికంగా ఉంటాయి. గుంపులుగా చేరి అకులు, పుష్పగుచ్ఛాలు, పూలు, పిందెల నుంచి రసాన్ని పీల్చివేస్తాయి. దీంతో పూత, పిందె రాలిపోతాయి. ఈ పురుగులు విసర్జించిన తేనెలాంటి పదార్థంపై నల్లని బూజులా ఏర్పడుతుంది. పురుగు నివారణకు వెంటనే ప్రొఫెనోపాస్ మందు 1.5 మిల్లీ లీటర్లు, లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. వివిధ దశల్లో ఈ పురుగు నివారణకు సస్య రక్షణ చేపట్టాలి. నల్ల పూత దశలో పిందెలు బఠానీ గింజ నుంచి చింత గింజ సైజులో ఉంటాయి. రెండు మిల్లీలీటర్ల డైమిథోయేట్ లేదా ఒక గ్రాము ఎసిఫేట్‌ను కలిపి పిచికారీ చేయాలి.

తామర పురుగు

తామర పురుగులు రెండు మిల్లీమీటర్ల పొడవులో ఉంటాయి. ఇవి కొత్త చిగుళ్ల దశలో ఆకుల రసాన్ని పీల్చి వేస్తాయి. చిగురు ఆకులు పెరగక రాలిపోతాయి. మొగ్గ విచ్చుకొనే దశలో ఈ పురుగులు ఎక్కువగా ఆశిస్తాయి. పిందె దశలో ఉన్నప్పుడు 0.3 మిల్లీ లీటర్ల స్పైనోసాడ్‌ను లీటరు నీటిలో కలిపి స్ప్రే చేయాలి.

పిండి నల్లి

పిండి నల్లి తల్లి పురుగులు చెట్టు కింద మట్టిలో గుడ్లు పెడతాయి. పిల్ల పురుగులు గుడ్ల నుంచి బయటకు వచ్చిన వెంటనే కాండం మీదకు పాకుకుంటూ చెట్టు పైకి పోయి, లేత ఆకుల నుంచి, కాండం నుంచి, కాయ నుంచి, కాయ కాడ నుంచి, రసాన్ని పీలుస్తాయి. తేనె లాంటి జిగురు పదార్థాన్ని విసర్జిస్తాయి. దానిపై మసి తెగులు వృద్ధి అవుతుంది. నివారణకు రెండు శాతం మిథైల్ పారాథియాన్ పొడి మందును మట్టిలో కలపాలి. ఇవి ఆశించిన కొమ్మలు, కాయలపై లీటరు నీటిని కలిపి పిచికారీ చేయాలి. ఆకు జల్లెడ గూడు పురుగు, మసిమంద, బూడిద తెగులు కూడా సోకే ప్రమాదం పొంచి ఉంది. నివారణకు వేర్వేరు ముందులను అధికారుల సూచనతో పిచికారీ చేయాలి.

తొడుగుల వల్ల చాలా ప్రయోజనం

మందులు పిచికారీ చేయడంతో పాటు కాయలకు తొడుగులు (ఫ్రూట్ కవర్) వాడడం వల్ల మంచి ఫలితాలు వస్తాయి. ఒక్కో కవర్‌పై ఒక రూపాయి రాయితీ ఉంటుంది. ఒక్కో రైతుకు గరిష్ఠంగా (5 ఎకరాల వరకూ) 20 వేల రూపాయలు రాయితీ లభిస్తుంది. అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రం ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

\- సీహెచ్ చంద్రశేఖరరావు, ఉద్యానశాఖ అధికారి, చీపురుపల్లి.

27న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక

(ఐదో పేజీ తరువాయి)

తుది ఓటర్ల జాబితా విడుదల చేశారు. తుది జాబితాలో 21,555 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 12,948 మంది పురుషులు, 8,607 మంది మహిళలు. శ్రీకాకుళం జిల్లాలో 4,829 మంది, విజయనగరం జిల్లాలో 4,937, పార్వతీపురం మన్యంలో 2,262, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,448, విశాఖపట్నం జిల్లాలో 5,277, అనకాపల్లి జిల్లాలో 2,802 మంది ఓటర్లు ఉన్నారు. ఆ తరువాత కూడా ఓటు నమోదుకు అవకాశం ఇవ్వడంతో మరో 1,000 మంది వరకు పెరిగారు. ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఎన్నికల అధికారిగా, విశాఖ జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీశంకర్ సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించనున్నారు.

అమల్లోకి ఎన్నికల కోడ్..

ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో బుధవారం నుంచి ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో కోడ్ అమలులోకి వచ్చింది. మార్చి ఎనిమిదో తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుంది. బుధవారం నుంచి మార్చి ఎనిమిదో తేదీ వరకూ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించకూడదు. కాగా ఆంధ్ర వైద్య కళాశాల సెంటినరీ బ్లాక్ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వచ్చే నెల నాలుగో తేదీన రావల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆ కార్యక్రమం వాయిదా పడింది. ఐదు వారాలపాటు ముఖ్యమంత్రి, మంత్రుల అధికారిక పర్యటనలు ఉండవని అధికారులు తెలిపారు.

గంజాయి కేసులో నలుగురి అరెస్టు

విజయనగరం క్రైమ్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పట్టణ కంటోన్మెంట్ ఏరియా రైల్వే కాలనీ ప్రాంతంలో గంజాయి అమ్ముతున్నట్లు అందిన సమాచారం మేరకు గూడ్స్ షెడ్ వద్ద నలుగురిని అరెస్టుచేసినట్లు ఒకటో పట్టణ స్టేషన్ సీఐ ఎన్.శ్రీనివాస్ తెలిపారు. వారి వద్ద సుమారు రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు బుధవారం నిఘా వేసి ఎస్.కోటకు చెందిన బోరమాల తరుణ్‌తేజ, సంపంగి భార్గవ్, విజయనగరం పట్టణానికి చెందిన సిరికి సాగర్, జొన్నగుడ్డికి చెందిన పావాడ సాయిచైతన్యలను నిందితులుగా గుర్తించి అరెస్టు చేశామన్నారు. వీరు గంజాయిని కొనుగోలు చేసి చిన్న ప్యాకెట్లుగా చేసి పట్టణంలో పలు ప్రాంతాల్లో అమ్ముతున్నట్లు గుర్తించామని తెలిపారు. పక్కా సమాచారంతో నిందితులను పట్టుకొని రెవెన్యూ అధికారుల సమక్షంలో తనిఖీ చేసి వారి వద్ద నుంచి రెండు కిలోల గంజాయిని సీజ్ చేసి, కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు. వీరితో పాటు ఒక మైనర్ కూడా ఉన్నాడని సీఐ తెలిపారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన సీఐ శ్రీనివాస్, ఎస్ఐ రామగణేశ్ ఇతర సిబ్బందిని డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు అభినందించారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం: మంత్రి

సాలూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సీఎంచంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. బుధవారం సాలూరు లోని క్యాంపు కార్యాలయంలో టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం పునరుజ్జీవానికి ఎన్డీఏ ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తోందని తెలిపారు. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి తనపై ఉన్న కేసుల నుంచి విముక్తి పొందడానికి ఢిల్లీ వెళ్లేవారని, అవసరమైతే రాష్ట్రాన్ని తాకట్టు పెట్టేందుకైనా సిద్ధపడ్డరని విమర్శించారు. దానికి భిన్నంగా ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు ఢిల్లీ వెళ్తున్నారని తెలిపారు. వెళ్లిన ప్రతిసారి కేంద్రం నుంచి రాష్ట్రానికి శుభవార్త తెస్తున్నారన్నారు. ఆర్థిక సంక్షోభంలో ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అభివృద్ధి చేసేందుకు కేంద్రం రూ.11140 కోట్లు ఆర్థిక సహాయం చేసేందుకు ఆమోదించిందని తెలిపారు. రాష్ట్రం పరిశ్రమల హబ్‌గా మార్చబోతున్నారని, దీంతో అనేక మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దు: డీఎస్పీ

బొబ్బిలి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): యువత చెడువ్యసనాలకు బానిసలు కావద్దని బొబ్బిలి డీఎస్పీ జి.భవ్యారెడ్డి సూచించారు.బుధవారం పట్టణంలో పలు జూనియర్ కళాశాలల్లో సంకల్ప రథం కార్యక్రమం ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాల జోలికి ఎవరూ పోవద్దని కోరారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం, విక్రయం, రవాణావంటి అంశాల్లో చిక్కుకుంటే భవిష్యత్‌ను నాశనం చేసుకున్న వారవుతారని హెచ్చరించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీఐ సతీష్‌కుమార్, ట్రాఫిక్ ఎస్ఐ జ్ఞానప్రసాద్, వీరేంద్రకుమార్,వెంకటరమణ పాల్గొన్నారు.

భక్తులకు రక్షణ కల్పించడంలో విఫలం

బొబ్బిలి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి):యూపీలోని బీజేపీ ప్రభుత్వం భక్తులకు రక్షణ విషయంలో పూర్తిగా విఫలమయ్యిందని కాంగ్రెస్, సీపీఐ నాయకులు మువ్వల శ్రీనివాసరావు, కోట అప్పన్నలు వేర్వేరు ప్రకటనల్లో ఆరోపించారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాలో బుధవారం తొక్కిసలాట జరిగి 30 మంది మృత్యువాత పడడంతోపాటు వందలాది క్షతగాత్రులు కావడంబాధాకరమని పేర్కొన్నారు. కుంభమేళాకు ఇచ్చిన ప్రచారం, భక్తుల భద్రతకు, వారి రక్షణకు ఇవ్వలేదని తెలిపారు.ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ ఘటనకు పూర్తి బాధ్యత వహించి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జనసమూహాన్ని ఎందుకు క్రమపద్ధతిలో నియంత్రించలేకపోయారని ప్రశ్నించారు.

చీటింగ్ కేసులో నిందితునికి జైలు శిక్ష

విజయనగరం క్రైమ్ జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విజయనగరం వన్‌టౌన్ స్టేషన్ పరిధిలో 2019లో నమోదైన చీటింగ్ కేసులో నిందితునికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.8వేలు జరిమానా విధిస్తూ ఏజేఎఫ్‌సీఎం కోర్టు బుధవారం తీర్పు ఇచ్చినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. గజపతినగరం మండలంలోని పురిటిపెంటకు చెందిన చలుమూరి వెంకటభాస్కరరావు ఐటీ మోసానికి పాల్పడడంతో అప్పటి వన్‌టౌన్ సీఐ డి.లక్ష్మణరావు కేసు నమోదు చేశారని చెప్పారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో నిందితునికి జైలు శిక్ష, జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

పురపాలక సంఘ కార్యాలయం, రాజాం

బహిరంగ వేలం ప్రకటన

Roc No.718/2009 & 237/2007 22/2004 & 313A1/2009A1, Dt.29.01.2025

2025-26 ఆర్థిక సంవత్సరం నందు ఈ పురపాలక సంఘమునకు సంబంధించి ఐదు మున్సిపల్ షాపింగ్‌కాంప్లెక్స్‌లలో ఖాళీగా ఉన్న షాప్ రూములు లీజుకు ఇచ్చుటకు ఈ దిగువ తెలిపిన షాప్‌లకు తే.6-02-2025 ఉదయం గం.11.00లకు పురపాలక సంఘ కార్యాలయ ఆవరణములో కమీషనర్ వారిచే గాని లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని బహిరంగ వేలం నిర్వహించబడును.

S.No	Complex Name	Shop No.	Category	Deposit
1	Rajiv Gandhi Bus Complex	6	OC (PHC-W)	5000
2	Rajiv Gandhi Bus Complex	7	OC (G)	5000
3	Rajiv Gandhi Bus Complex	9	OC	5000
4	Office Front Shops	4	BC-A(W)	5000
5	Bus Stand Out Gate	2	BC	5000
6	Bus Stand Out Gate	4	OC	5000
7	Bus Stand Out Gate	5	OC (PHC-W)	5000
8	Annapurna Shopping Complex	6	BC(W)	5000
9	Annapurna Shopping Complex	10	OC	5000
10	Annapurna Shopping Complex	11	BC	5000
11	Annapurna Shopping Complex	12	SC	5000
12	Annapurna Shopping Complex	13	SC	5000
13	Annapurna Shopping Complex	14	BC	5000
14	Annapurna Shopping Complex	15	BC	5000
15	Annapurna Shopping Complex	16	BC	5000
16	Annapurna Shopping Complex	18	BC	5000
17	Annapurna Shopping Complex	19	OC(W)	5000
18	Annapurna Shopping Complex	20	BC	5000
19	Annapurna Shopping Complex	21	BC-A (Rajika)	5000
20	Surya Complex	10	OC	5000
21	Surya Complex	13	OC	5000
22	Surya Complex	14	OC	5000
23	Surya Complex	18	SC-(W)	5000

సదరు బహిరంగ వేలంలో పాల్గొనదలిచిన వారు ఈ పురపాలక సంఘము కార్యాలయమునకు ఎటువంటి బకాయిలు కలిగియుండరాదు. బహిరంగవేలము రోజు దరఖాస్తునకు రూ.5,000/-లు చెల్లించవలసి ఉన్నది మరియు రూ.5,000/-లకు పురపాలక సంఘము వారు జారీ చేసిన సాల్వెన్సీ ధృవపత్రము వేలము సమయమునకు కార్యాలయములో సమర్పించవలెను. కావున ఆసక్తి కలిగినవారు బహిరంగవేలములో పాల్గొనదలిచిన వారు పూర్తి వివరముల కొరకు పురపాలక సంఘము కార్యాలయము పనిచేయు సమయములో సంప్రదించవలసినదిగా కోరడమైనది. పాటదారులు పురపాలక సంఘ చట్టము 1965లోని నిబంధనలకు బద్ధులై ఉండవలెను. వేలము ఏ కారణము చేతనైనా వాయిదా వేయుటకు లేదా రద్దు పరుచుటకు కమీషనర్ వారికి అధికారం కలదు.

సం/- కమీషనరు,
రాజాం పురపాలక సంఘము